# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :214 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 01-11-2025 | పేజీలు:4 వెల: 2.00


### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన...

హైదరాబాద్,ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. వారం రోజుల్లో బీఆర్ఎస్ కేడర్‌ను లేకుండా చేస్తానన్న నవీన్ యాదవ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నేతలు ప్లలె రవికుమార్, కె.కిషోర్ గౌడ్, రామచంద్రు నాయక్, ఉపేంద్ర చారి ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్ క్యాడర్‌ను ఉద్దేశించి 'గల్లీ దాటరు.. ఇంటిని చూడరు' అంటూ బెదిరించిన ఆయన తాజాగా గులాబీ క్యాడర్‌నే లేకుండా చేస్తానని బెదిరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. తాజాగా ఓ యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సదరు యాంకర్ 'బీఆర్ఎస్ క్యాడర్‌ను లేకుండా చేస్తా అంటున్నారు.. నిజంగా లేకుండా చేస్తారా?' అని ప్రశ్నించగా 'ఏసేస్తా'? వారం రోజుల్లో బీఆర్ఎస్ క్యాడర్ లేకుండా చేస్తా' అంటూ మరోసారి ధమ్కీ ఇచ్చారు. దీనిపైనా సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. రౌడీబిడ్డకు టికెట్ ఇస్తే ఇలాంటి బెదిరింపులకే పాల్పడతారు.

## మన సత్తా ఏంటో ఉగ్రవాదులకు తెలిసింది : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన దేశం నిజమైన బలం ఏంటో శత్రుదేశానికి తెలిసిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' అంశాన్ని ప్రస్తావించారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ తన శత్రుదేశ భూభాగంలోకి ప్రవేశించి దాడి చేయగలదన్న స్పష్టమైన సందేశాన్ని ప్రపంచానికి పంపిందన్నారు. 'ఎవరైనా మనదేశం వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే.. భారత్ వారి భూభాగంలోకి చొరబడి మరీ దెబ్బకొడుతుందని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచమంతా చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో పాక్, ఆ ఉగ్రవాదులకు తెలిసింది' అని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢ వైఖరి సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు.

## కారుకు,బుల్డోజర్‌కు మధ్య పోటీ నడుస్తోంది

హైదరాబాద్, రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు . హైదరాబాద్‌లోని పలువురు ఎంఐఎం నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ అన్నారు. తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ.. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కేటీఆర్ కోరారు. ఉప ఎన్నికలో డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. అయితే.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలని అన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలు అని ఆయన అభివర్ణించారు. పేదల ఇండ్లు కూలగొట్టిన ఈ బుల్జోజర్ ప్రభుత్వానికి ఓటుతో



బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలపై కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని ఆయన ధైర్యం చెప్పారు. మీరు ధైర్యం చేయండి.. ఎవరైనా బెదిరిస్తే వారి సంగతి తర్వాత చూద్దామని అన్నారు. ప్రజలకు తాము ఎప్పటికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పనిచేయాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు .

## ఎన్డీయే సంచలన హామీలు .. కోటి ఉద్యోగాలు



పాట్నా:బిహార్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రతి వర్గానికి ప్రాధాన్యతనిస్తూ రైతులు, యువత, మహిళలు, కులవృత్తుల అభివృద్ధి కోసం పలు కొత్త పథకాలు అమలు చేయనుంది.

**రైతుల కోసం పెరిగిన పెట్టుబడి సాయం**

ప్రస్తుతం రైతులకు అందిస్తున్న రూ.6 వేల కర్పూరి ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధిను రూ.9 వేలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద రైతులు సంవత్సరానికి మూడు విడతలుగా సాయం పొందుతారు. పెరుగుతున్న ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరల మధ్య రైతులకు ఈ ఆర్థిక సాయం ఉపశమనం కలిగిస్తుంది.

**యువతకు కోటి ఉద్యోగాలు**

రాష్ట్రంలోనినిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కోటి ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పరిశ్రమల ప్రోత్సాహం, ఐటీ పార్కులు, స్టార్టప్ ప్రోత్సాహక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఏర్పడే తయారీ యూనిట్లు, రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

**మహిళల ఆర్థిక శక్తివంతం**

"ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన" కింద ప్రభుత్వం కోటి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ పథకం ద్వారా మహిళలకు చిన్న వ్యాపార రుణాలు, నైపుణ్య శిక్షణ, మార్కెట్ లింకేజీ, డిజిటల్ ట్రాన్సాక్షన్ అవగాహన కల్పించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయనున్నారు.

**ఈబీసీలకు రూ.10 లక్షల సాయం**

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. సంప్రదాయ వృత్తులను ఆధునిక పద్ధతులతో అనుసంధానం చేసి, స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడమే లక్ష్యం.

**ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి –రోడ్లు, రైళ్లు, మెట్రో, విమాన సర్వీసులు**

బిహార్‌లో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులు విస్తరణ, కొత్త రైల్వే లైన్ల అభివృద్ధి, పట్నా మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తోంది. అదనంగా, బిహార్ నుంచి విదేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించి అంతర్జాతీయ కనెక్టివిటీ పెంచనున్నారు. దీని ద్వారా వ్యాపారాలు, పర్యాటకం, ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా.

**సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యం**

ఈ పథకాలన్నీ బిహార్‌లో సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక సమతుల్యత దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న వ్యూహాత్మక అడుగులుగా భావించబ డుతున్నాయి. ప్రతి వర్గం ఆర్థికంగా బలపడటమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

## బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కేసు

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోఎన్నికల ప్రక్రియలో నియమాలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు వినిపించాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత పై పార్టీ గుర్తుతో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నారని కేసు నమోదైంది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత మోహన్ రెడ్డి రిటర్నింగ్ అధికారి వద్ద ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం, జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుతో ఓటర్ స్లిప్పులను పంచుతున్నారని మోహన్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు ఆయన పేర్కొని, రిటర్నింగ్ అధికారి వద్ద లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం జరిగింది.

**కాంగ్రెస్ ఫిర్యాదు ఆధారంగా పోలీసుల దర్యాప్తు ప్రారంభం**

ఫిర్యాదును స్వీకరించిన రిటర్నింగ్ అధికారి, పోలీసులను దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఆర్వో ఆదేశాల మేరకు బోరబండ పోలీసులు రంగంలోకి వచ్చి, మాగంటి సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. రిటర్నింగ్ అధికారి ఆ ఈ ఫిర్యాదును స్వీకరించి, సమస్యను పరిశీలించమని బోరబండ పోలీసులను ఆదేశించారు. ఆర్వో ఆదేశాల మేరకు, మాగంటి సునీతపై



కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రస్తుతం పోలీసులు సాక్ష్యాలు సేకరిస్తూ, స్లిప్పుల పంపిణీ చరిత్రను అర్థం చేసుకుంటున్నారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఈ సంఘటన జూబ్లీహిల్స్‌లో ఎన్నికలకి రాజకీయంగా ప్రభావం చూపవచ్చని సూచిస్తున్నారు. ఎన్నికల నియమాలు పాటించటం,ప్రచారంలో తక్షణం నియమాల ప్రకారం వ్యవహరించడం రాజకీయ పార్టీలకు కీలకమని పేర్కొంటున్నారు. ఇక భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు నివారించడానికి

## మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్

హైదరాబాద్ : తెలంగాణ కేబినెట్ మంత్రిగా మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ పదవి ప్రమాణ స్వీకారం చేశారు. అజారుద్దీన్ తో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కేబినెట్ మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సహా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో తెలంగాణ కేబినెట్ లో సీఎం సహా మంత్రుల సంఖ్య 16కు చేరుకుంది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. అయితే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరామ్, అజారుద్దీన్ లను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనను నామినేట్ చేసింది. అయితే గవర్నర్ ఆమోదం పెండింగ్ లో ఉండగానే..ఆయన మంత్రిగా ప్రమాణం చేశారు. నిబంధనల మేరకు అజారుద్దీన్ 6నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలి. లేదంటే ఆయన మంత్రి పదవి నుంచి వైదొలగడం అనివార్యం కానుంది.

**క్రికెటర్ నుంచి మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్**

మహమ్మద్ అజారుద్దీన్ హైదరాబాద్ నగరంలో అజీజుద్దీన్, యూసఫ్ సుల్తానా దంపతులకు 1963 ఫిబ్రవరి 8న జన్మించారు. ఆల్ సెయింట్స్ హై స్కూల్లో పాఠశాల విద్యను, నిజాం కళాశాల నుంచి బీకాం డిగ్రీ పూర్తి చేశారు. అజారుద్దీన్ 1987లో నౌరీన్ ను వివాహం చేసుకున్నాడు. వారికి మహమ్మద్ అసదుద్దీన్, మ హమ్మద్ అయాజుద్దీన్ లు కుమారులు. 1996లో అజార్ భార్య నౌరీన్ కు విడాకులు ఇచ్చి నటి సంగీత బిజిలానీని వివాహం చేసుకున్నారు. సంగీత కూడా 2010లో అజార్ నుంచి విడాకులకు దరఖాస్తు చేసుకుంది. అజార్ చిన్న కుమారుడు అయాజుద్దీన్ 2011 సెప్టెంబర్ 11న అవుటర్ రింగ్ రోడ్ లో పుప్పాలగూడ వద్ద బైక్ ప్రమాదంలో గాయపడి మరణించారు. పెద్ద కుమారుడు అసదుద్దీన్ 2019లో టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సోదరి ఆనం మీర్జాను వివాహం చేసుకున్నాడు.

**అజార్ క్రికెట్ నేపథ్యం**

మొదటిసారిగా 1984 డిసెంబరు 31 న కలకత్తాలో ఇంగ్లాండ్ తో జరిగిన టెస్టు మ్యాచ్ లో భారత్ నుంచి అంతర్జాతీయ కెరీర్ ప్రారంభించాడు. మణికట్టు బ్యాటర్ గా అంతర్జాతీయ క్రికెట్ లో తన ఆటతో అజార్ ప్రత్యేకంగా నిలిచాడు. 1989లో కృష్ణమాచారి శ్రీకాంత్ తర్వాత భారత క్రికెట్ జట్టు కెప్టెన్సీ చేపట్టాడు. 16ఏళ్ల కెరీర్ లో మొత్తం 47 టెస్ట్ మ్యాచులు, 174 వన్డే మ్యాచ్ లకు కెప్టెన్



గా వ్యవహరించాడు. టీమ్ ఇండియా తరపున 99 టెస్టు మ్యాచ్ లలో 22సెంచరీలు, 21హాఫ్ సెంచరీలు చేశారు. 334 వన్డే మ్యాచ్ లు ఆడి..7సెంచరీలు, 58హాఫ్ సెంచరీలు చేశాడు. 1985వన్డే వరల్డ్ కప్ సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నారు. 1990–91ఆసియాకప్, 1995అసియాకప్ సాధించిన టీమిండియాకు కెప్టెన్ గా వ్యవహరించాడు. అజార్ సారథ్యంలో 1996 క్రికెట్ వరల్డ్ కప్ లో భారత్ సెమీఫైనల్ కు చేరుకుంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో అజార్ 54 సెంచరీలు, 74 సెంచరీలు సాధించారు. మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణంలో ఇరుక్కున్న అజారుద్దీన్ పై బీసీసీ జీవిత కాలం నిషేధం విధించడంతో..ఆయన క్రికెట్ కెరీర్ ముగిసింది. 2012లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలతో బీసీసీఐ అజార్ పై జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసింది. 2013న ఢిల్లీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2019లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**అజార్ రాజకీయ ప్రస్థానం**

2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్ పార్టీలో చేరిన అజారుద్దీన్ అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014 లోక్ సభ ఎన్నిలకల్లో రాజస్థాన్ లోని టోంకు సవాయి మాదోపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమితులయ్యారు. 2019లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2023తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ పై 16,337ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ఆయనను ప్రభుత్వం నామినేట్ చేసింది. అయితే గవర్నర్ ఆమోదం పెండింగ్ లో ఉంది.

## సీపీఎం సీనియర్ నేత సామినేని రామారావు దారుణ హత్య



ఖమ్మం:ఖమ్మం జిల్లా సీపీఎం నేత, రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావు హత్యకు గురయ్యారు. చింతకాని మండలం పాతర్లపాడులో శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన రామారావును దుండగులు కత్తులతో పొడిచి, గొంతుకోసి హత్య చేశారు. రామారావు రెండుసార్లు రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా, పాతర్లపాడు సర్పంచ్‌గా పనిచేశారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నేతలు రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. రామారావు హత్యతో ఉద్రిక్తతలు నెలకొనకుండా పాతర్లపాడులో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావు లేదు: భట్టి విక్రమార్క**

సామినేని రామారావు హత్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావులేదని.. దోషులను పట్టుకుని చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లాలో హత్యా రాజకీయాలు చోటుచేసుకోవడంపై ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు సంధిస్తున్నాయి. సీపీఎం పార్టీ అధికార పార్టీపైనే అనుమానాలు వ్యక్తం చేస్తుంది. స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే రామారావు హత్య జరిగిందనిఆరోపిస్తుంది.

## ఎమ్మెల్యేల విచారణపై సుప్రీంను గడువుకోరిన స్పీకర్

హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు తెలంగాణ స్పీకర్ మరింత గడువు కోరారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై విచారణకు సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో స్పీకర్ కార్యాలయం.. ఎమ్మెల్యేల విచారణకు న్యాయస్థానాన్ని మరో రెండు నెలల గడువు కోరింది. పార్టీ ఫిరాయించిన10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులివ్వగా.. వారిలో 8 మంది మాత్రమే స్పందించారని, నలుగురి విచారణ మాత్రమే ముగిసిందని, మిగతా వారిని విచారించాల్సి ఉందని స్పీకర్ తరపు లాయర్లు సుప్రీంకోర్టుకు తెలిపారు.కాగా, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీంతో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ స్పీకర్ కు



సుప్రీం మూడు నెలల గడువు విధించింది.

## మొంథా తుఫాన్ విధ్వంసం... ఏపిలో మరణాలు లేవు... ఇక్కడ ఉన్నాయి



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుఫాన్ మీద ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఒక్కరు కూడా చనిపోలేదని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రశంసించారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మొద్దు నిద్ర వల్ల 12 మంది చనిపోయారని, ఇంకా చాలా మంది గల్లంతు అయ్యారని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అసమర్ధతతో పాటు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇవాళ విధ్వంసం ఎక్కువైందని మండిపడ్డారు. తుఫాన్ ప్రభావంతో 4.47 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసిందని అది ముమ్మాటికీ తప్పే అని ధ్వజమెత్తారు. పంటను అమ్మడానికి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకెళ్లారని, అకాల వర్షాలకు పంట తడిచి రైతులు నష్టపోవడంతో వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంటను కొనడానికి ప్రభుత్వం కొర్రీలు పెట్టిందని, దీంతో పంటను అమ్మడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. తేమశాతాన్ని, డ్యామేజ్ ను పరిగణనలోకి తీసుకోకుండా పత్తి, వరి, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు

## సంపాదకీయం

శనివారం 01-11-2025

# చిన్న రియాక్టర్లే 'అణు'కూలం

ఇంధన రంగంలో స్వావలంబన, శాస్త్రసాంకేతిక సత్తా, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధనకు భారత అణు ప్రస్థానం విశిష్ట ప్రతీక. స్వాతంత్ర్యం వచ్చిన కొన్నేళ్లకే డాక్టర్ హోమీ జె.భాభా దార్శనికత, నాయకత్వం మన అణు కార్యక్రమాన్ని ముందుకు నడిపించింది. విద్యుదుత్పాదన, రక్షణ అవసరాలకు అణు రంగం ప్రధానమని గుర్తించిన భారత్- పరిశోధనలను ముమ్మరం చేసింది. డాక్టర్ హోమీ జె.భాభా జయంతి సందర్భంగా...చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాల వల్ల సంభవిస్తున్న వాతావరణ మార్పులతో ప్రపంచం తల్లడిల్లుతోంది. ఈ ఇంధనాలకు స్వస్తి చెప్పడానికి అణు విద్యుత్తు తోడ్పడుతుంది. అణు విద్యుదుత్పాదనలో విప్లవాత్మక ఆవిష్కరణే చిన్న మాడ్యులర్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్). సంప్రదాయ అణు రియాక్టర్లు భారీగా ఉంటాయి. ఎస్ఎంఆర్‌లు పేరుకు తగ్గట్టే పరిమాణంలో చిన్నవి. వీటి విడిభాగాలను ఫ్యాక్టరీలలో పెద్ద సంఖ్యలో తయారు చేసి, నిర్దేశిత స్థలానికి రవాణా చేసి కూర్పు చేయవచ్చు. అణు విద్యుదుత్పాదన కేంద్రాలను వేగంగా నిర్మించి కరెంటు అవసరాలను తీర్చవచ్చు. 2025లో భారత్ అణు విద్యుదుత్పాదన సామర్థ్యం 8 గిగావాట్లు. దేశానికి కావాల్సిన విద్యుత్తులో కేవలం రెండు శాతాన్నే అణు విద్యుత్కేంద్రాలు సమకూరుస్తున్నాయి. వికసిత భారత్ లక్ష్య సాధన కోసం అణు విద్యుదుత్పాదనను విస్తరించాలి.

ఒత్తిళ్లను అధిగమించి...

భారత అణు కార్యక్రమ పితామహుడు డాక్టర్ హోమీ జహంగీర్ భాభా ప్రస్థానం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)లో ప్రారంభమైంది. ఆయన 1945లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సంస్థలో చేరి భౌతికశాస్త్రంలో, కాస్మిక్ కిరణాలపై పరిశోధనలు చేపట్టారు. అక్కడి నుంచి అణు భౌతిక శాస్త్రంపై దృష్టి సారించారు. చమురు వంటి ఇంధన వనరులు లేక దిగుమతులపై ఆధారపడుతున్న భారతదేశానికి అణు విద్యుత్తు ఎంతో అక్కరకొస్తుందని గుర్తించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే అణు విద్యుత్తు కమిషన్‌ను ఏర్పాటుచేశారు. తరవాత డాక్టర్ భాభా కార్యదర్శిగా భారత ప్రభుత్వంలో అణుశక్తి విభాగం ప్రారంభమైంది. ఇది ప్రధానమంత్రి కార్యాలయ పర్యవేక్షణలో పనిచేస్తుంది. భారత అణు కార్యక్రమం పరిశోధక రియాక్టర్లతో మొదలైంది. 1956లో అప్సర, 1960లో కెనడా నుంచి సేకరించిన 40 మెగావాట్ల సైరస్ రియాక్టర్, 1985లో స్వదేశంలో నిర్మించిన ధ్రువ రియాక్టర్ అణు పరిశోధనకు ఆలంబనగా మారాయి. 1987లో భారత అణుశక్తి సంస్థ(ఎన్‌పీసీఐఎల్)ను నెలకొల్పారు. డాక్టర్ భాభా మొదటి దశలో యురేనియాన్ని ఇంధనంగా ఉపయోగించే ప్రెషరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్లపై దృష్టి కేంద్రీకరించారు. తరవాత యురేనియం నుంచి ప్లుటోనియంను, థోరియం నుంచి యురేనియం233ని ఉత్పత్తి చేసే ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లకు ప్రాధాన్యమిచ్చారు. పూర్తిగా థోరియం మీద ఆధారపడిన అడ్వాన్స్‌డ్ రియాక్టర్లపై భారత్ ఇప్పుడు దృష్టి కేంద్రీకరించింది. దేశంలో 10 లక్షల టన్నుల థోరియం నిక్షేపాలు ఉండటం ఇక్కడ గమనార్హం.భౌగోళిక, రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుంటూ భారత అణు కార్యక్రమం పురోగమించింది. సైరస్ రియాక్టర్ నుంచి ఉత్పత్తి చేసిన ప్లుటోనియంను ఉపయోగించి 1974లో స్మైలింగ్ బుద్ధ పేరుతో భారత్ తొలి అణ్వస్త్ర పరీక్ష జరిపింది. ఇది శాంతియుత ప్రయోజనాలకు ఉద్దేశించినదని ఇండియా వివరించినా అంతర్జాతీయ ఆంక్షలను ఎదుర్కోక తప్పలేదు. అంతర్జాతీయ అణు వాణిజ్యం నుంచీ భారత్‌ను వెలివేశారు. 1998లో భారత్ ఒక థర్మోన్యూక్లియర్ పరీక్ష సహా మొత్తం అయిదు అణ్వస్త్రాలను పరీక్షించి తన శక్తి సామర్థ్యాలను చాటుకుంది. దీంతో ఆంక్షలు ఉద్ధృతమయ్యాయి. కానీ, 2005లో అమెరికాతో అణు సహకార ఒప్పందం, 2008లో అణు సరఫరాదారుల గ్రూపు మినహాయింపు వల్ల ఆంక్షల పర్వానికి తెరపడింది. 2025లో అణు ఇంధన కాంప్లెక్స్ హైరెసిడ్యువల్ నియోబియం కడ్డీలను ఉత్పత్తి చేసింది. 2025-26 కేంద్ర బడ్జెట్ హరిత ఇంధనాలు, అణుశక్తిపై పరిశోధనలకు అధిక నిధులు కేటాయించింది. 2031కల్లా హరిత ఇంధనాలతో 22.5 గిగావాట్లను, 2047కల్లా 100 గిగావాట్ల శుద్ధ విద్యుత్తును తయారు చేయాలనేది భారత్ ఆశయం.

ఇండియా 1980 దశకం నుంచి క్షిపణుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. అణ్వస్త్రాలను తీసుకెళ్లి ప్రయోగించే క్షిపణుల తయారీలో పట్టుసాధించింది. 150-300 కిలోమీటర్ల దూరంలోని శత్రు లక్ష్యాలపై అణుబాంబును ప్రయోగించగల పృథ్వీ, అగ్ని-5 వంటి రకరకాల క్షిపణులు నేడు మన అమ్ములపొదిలో ఉన్నాయి. 2016లో బరిలో దిగిన అరిహంత్, 2024లో రంగప్రవేశం చేసిన అరిఘాత్ జలాంతర్గాములకు అణ్వస్త్ర ప్రయోగ సామర్థ్యం ఉంది. అరిదమన్ జలాంతర్గామి సిద్ధమవుతోంది. ఈ అరిభయంకర అణ్వస్త్రాలు భారతదేశానికి రక్షణ కవచాల వంటివి!

విరివిగా విద్యుదుత్పత్తి

వాతావరణ మార్పుల నిరోధానికి హరిత ఇంధనాల దిశగా మళుతున్న ఇండియాకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లు గొప్ప మలుపు కానున్నాయి. 300 మెగావాట్ల లోపు ఉత్పాదక సామర్థ్యం కలిగిన ఎస్ఎంఆర్‌లను మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడే పరిశ్రమలను నెలకొల్పవచ్చు. తక్కువ సమయంలో వేగంగా తరలించి, తక్కువ ఖర్చుతో స్థాపించి, భద్రంగా విద్యుదుత్పాదన చేసే సామర్థ్యం వీటి సొంతం. సముద్ర నీటి నుంచి తాగునీరు తయారుచేసే కర్మాగారాలను నడపడానికి ఎస్ఎంఆర్ విద్యుత్తును అందించగలదు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికీ తోడ్పడుతుంది. పరిశ్రమలకు సొంత విద్యుదుత్పాదన సౌకర్యాన్ని అందిస్తుంది. ఎస్ఎంఆర్‌ల కోసం 2024-25 కేంద్ర బడ్జెట్ భారత్ చిన్న రియాక్టర్ల పేరుతో ఎస్ఎంఆర్‌లకు నిధులు, అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది పద్దులో వాటికి రూ.20వేల కోట్లు కేటాయించారు. 2033కల్లా అయిదు ఎస్ఎంఆర్‌లను తయారు చేయాలని భారత్ లక్షిస్తోంది. భాభా అణు పరిశోధన సంస్థ (బార్క్) ఈ ఆగస్టులో మూడు డిజైన్లను ఆవిష్కరించింది. అయితే అణుశక్తి ఉత్పాదనకు కావాల్సిన యురేనియం కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అగత్యాన్ని అధిగమించాల్సి ఉంది. అణు విద్యుత్కేంద్రాలపై ప్రజల్లో అపోహలను తొలగించాలి. అణు విద్యుదుత్పాదన ఖర్చును తగ్గించడానికి పరిశోధనలపై నిధులు వెచ్చించాలి. మిత్ర దేశాలతో సహకార ఒప్పందాలు కుదుర్చుకోవాలి. పెద్ద సంఖ్యలో నిపుణులను తయారు చేసుకోవాలి.

# చలికి గజ గజ..అయినా తప్పని చన్నీటి స్నానాలు



పాడేరు/పాడేరు టౌన్/అరకులోయ/హుకుంపేట/డుంబ్రిగుడ : మొంథా తుపాన్‌తో రాష్ట్రంతా వాతావరణం ఎంత చల్లగా మారిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీనికి తోడు, విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు చల్లగాలిని ఏ మాత్రం ఆపలేకపోతున్నాయి. దీంతో చలికి గజ..గజ వణుకుతూ ఒక మూలకు ముడుచుకోవాల్సిందే! ఇది చాలదన్నట్లు ఇది చాలదన్నట్లు ఎప్పుడో బిగించిన సోలార్ హీటర్లు చెడిపోవడంతో తప్పని చన్నీటి స్నానాలు! %ౌ% ఇది అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో తలారి సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం దుస్థితి! జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ, టిడబ్ల్యు డిడి కార్యాలయాలకు అర కిలోమీటరు, పాడేరు మండల ఎటిడబ్ల్యు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. ఈ హాస్టల్‌లో 496 మంది విద్యార్థులు ఉన్నారు.! వీరికి తాగేందుకు పరిశుభ్రమైన నీరు లేదు. హాస్టల్ రూముల్లో సరిపడా విద్యుత్ సదుపాయం, లైటింగ్ లేవు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. హాస్టల్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉంది. దోమలు ముసురుకుంటున్నాయి.

ఈ హా జిల్లా కేంద్రంలోని హాస్టల్ పరిస్థితే ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా పలు హాస్టళ్లను పరిశీలించిన ప్రజాశక్తి బృందానికి దాదాపుగా అన్ని చోట్ల ఇటువంటి పరిస్థితులే కనిపించాయి. పాడేరు ఐటిడిఎ పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ ఆశ్రమాలు 150 నడుస్తున్నాయి. గురుకులాలు 31 ఉన్నాయి. వీటిలో చాలా సంక్షేమ వసతి గృహాల్లో పలు సమస్యలు తిష్టవేశాయి. పారిశుధ్యం లోపించింది. అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు ఉన్నాయి. తలుపులు, కిటికీలు, రక్షణ గోడలు లేని భవనాలే అధికంగా దర్శనమిస్తున్నాయి. దోమల బెడద అధికంగా ఉంది. పలుచోట్ల తాగునీరు, సరైన వసతి సదుపాయాలు కరువయ్యాయి. సోలార్ వాటర్ హీటర్లు మూలకు చేరడంతో విద్యార్థులకు చన్నీళ్లే దిక్కవుతున్నాయి. గిరిజన విద్యార్థుల సంక్షేమంపై టిడిపి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

నేలమీదే చదువులు.. అక్కడే పడక

హుకుంపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాల (బాలురు-2)కు సొంత భవనం లేదు. ఇక్కడి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో ఆశ్రయమిచ్చారు. ఇక్కడ 320 మంది విద్యార్థులు ఉండగా, వారికి కేవలం నాలుగు గదులు మాత్రమే కేటాయించారు. వాటిలోనే పగటి పూట చదువులు సాగుతున్నాయి. రాత్రిపూట చాలీచాలని చోటులో విద్యార్థులు ఇరుక్కుని నిద్రపోతున్నారు. రాత్రిపూట తేళ్లు, పాములు వస్తున్నాయని చెబుతున్నారు. వంట గది, వసతి, తరగతులు అన్నీ ఒకే భవనంలో నడుస్తుండడంతో పరిశుభ్రత కరువైంది. 2018-19లో సర్వశిక్ష అభియాన్ నిధులతో కొత్త భవనం మంజూరైనప్పటికీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. 'తొందరగా పాఠశాల భవనం ఏర్పాటు చేసి విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి కల్పించాల్సి ఉంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే' అని ప్రధానోపాధ్యాయుడు కొండలరావు తెలిపారు. వర్షాకాలంలో ఈ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని వార్డెన్ ప్రవీణ్ తేజ చెప్పారు.

ఆరుబయటే భోజనాలు

డుంబ్రిగుడ మండలం కించుమండ, కిల్లోగూడ, సొవ్వా, గుంటసీమ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనశాలలు లేక ఆరుబయట భోజనాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో తడుస్తూ ప్లేట్లలో భోజనాలు తీసుకొని వసతి గదుల వద్దకు వెళ్లి తింటున్నామని పలువురు విద్యార్థులు తెలిపారు. అరకులోయలోని ఆదిమ జాతి గిరిజన గురుకుల (పివిటిజి) వసతి గృహంలో 661 మంది ఆదిమ జాతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 56 మరుగుదొడ్లలో సగం నిరుపయోగంగా ఉన్నాయి. ఒక బ్లాక్‌లోని మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేదు. మరో బ్లాక్‌లోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు సరిపోక ఆరుబయట మలవిసర్జనకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. బెడ్లు ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడానికి రూము సరిపోక ఒక్కొక్క మంచంపై ఇద్దరు నిద్రిస్తున్నారు. సరిపడా డార్మెటరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. తరగతి గదులు వర్షానికి కారుతున్నాయి. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. 'మరుగుదొడ్ల నిర్వహణకు డబ్బులు ఇవ్వడం లేదు. కొన్నే పని చేస్తున్నాయి. మాకు నెలవారీ చెల్లించే రూ.6 వేలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు' అని మరుగుదొడ్ల నిర్వాహకురాలు లక్ష్మి తెలిపారు.


అలంకారప్రాయంగా సోలార్ వాటర్ హీటర్లు

గిరిజన వసతి గృహాల్లో ఆరేళ్లుగా సోలార్ వాటర్ హీటర్లు పనిచేయడం లేదు. ఆశ్రమ విద్యార్థుల స్నానాల కోసం వేడి నీళ్లు అందించడానికి వీటిని 2013-14లో సుమారు కోటిన్నర వ్యయంతో ఏర్పాటు చేశారు. మొత్తంగా పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు అమర్చేందుకు అవకాశం ఉన్న 87 ఆశ్రమ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో పెట్టారు. ఇవి మూడేళ్ల ముచ్చటగానే మారాయి. 2019 నాటికి పూర్తిగా మూలకు చేరాయి. నిర్వహణ లోపమే ఈ సోలార్ హీటర్ల వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. అవి అందుబాటులోలేక విద్యార్థులు గజగజ వణికించే చలిలో శీతాకాలం చన్నీళ్ల స్నానాలు చేసేందుకు వెనుకాడుతున్నారు. చర్మవ్యాధులకు గురవుతున్నారు. 'చన్నీళ్ల స్నానం చేయలేకపోతున్నాం. ఉదయాన్నే స్టడీ అవర్స్‌కు తరగతిలోకి వెళ్లడానికి వేకువ జామున స్నానాలు చేయాలి. ట్యాంకులో వాటర్ చాలా చల్లగా ఉంటోంది. రోజు విడిచి రోజు మధ్యాహ్నం, సాయంత్రం పూట స్నానాలు చేస్తున్నాం' అని లోచలిపుట్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థి చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

హాస్టళ్లలో సమస్యలను పరిశీలిస్తున్నాం. ఇప్పటికే సగానికిపైగా సందర్శించాను. సక్రమ నిర్వహణకు అవసరమైన సూచనలు చేశాం. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. పరిష్కారానికి చర్యలు చేపడతాం.
-పిబికె.పరిమళ, టిడబ్ల్యు డిడి, పాడేరు ఐటిడిఎ, అల్లూరి జిల్లా

# టీడీపీకి దిక్కెవరు.. ఉమ్మడి చిత్తూరు జిల్లా పై బాబు ప్లాన్ ఏమిటి?



చిత్తూరు:ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయాయి. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా, స్థానిక నాయకత్వం కొరవడడం, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం పార్టీ క్యాడర్‌ను కలవరానికి గురిచేస్తోంది. తంబళ్లపల్లి, తిరుపతి, సత్యవేడు, పుంగనూరు%ౌ% ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్‌ఛార్జ్‌ల పనితీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉందట. అధికారం ఉన్నా తమను తాము రక్షించుకోలేని స్థితిలో ఉన్నామంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత చంద్రబాబు ఏ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే ఉమ్మడి చిత్తూరు భవిష్యత్తు ఆధారపడి ఉంది.

ఇన్‌ఛార్జ్‌ల నియామకం, పనితీరపై అసంతృప్తి:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రమైన నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్‌ల నియామకం, వారి పనితీరుపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నదట. నాలుగు కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి 'చుక్కాని లేని నావ' వలె మారిందట. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం, ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకున్న నేతలకు కీలక పదవులు ఇవ్వడం, వారు లోకల్ నాయకులను విస్మరించి, తమ సొంత కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడమేనని క్యాడర్ ఆరోపిస్తోంది.

శంకర్ యాదవ్, దొరస్వామి నాయుడు ప్రయత్నాలు:

తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ పొందిన జయచంద్రారెడ్డి ఇటీవలే నకిలీ మద్యం వ్యవహారంలో చిక్కుకోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన పార్టీలో చేరిన సమయంలోనే స్థానిక క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, కడప జిల్లాకు చెందిన కొందరు నేతల సహకారంతో టికెట్ సంపాదించారట. గత 16 నెలలుగా ఆయన పార్టీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ నియామకం కంటే, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానిక క్యాడర్ పట్టుబడుతోందట. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి తిరిగి వస్తారని ప్రచారం జరుగుతున్నా, గతంలో ఆయన చంద్రబాబుపై చేసిన విమర్శల కారణంగా టీడీపీ కార్యకర్తలు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదట. మరోవైపు, శంకర్ యాదవ్, తెలుగు యువత నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, క్యాడర్ మాత్రం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని కోరుకుంటోందట.

త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్:

తిరుపతి నియోజకవర్గంలో కూడా ఇదే విధమైన నాయకత్వ శూన్యత నెలకొని ఉందట. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నప్పటికీ, ఆమెకు సహకరించే నాయకత్వం లేకపోవడంతో ఆమె ప్రయత్నాలు ఫలించడం లేదు. చాలామంది నాయకులు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నించి, ఆశలు వదులుకుని సైలెంట్ అయ్యారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉండటం, అధిక సంఖ్యలో వైసీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు జనసేన వైపు మొగ్గు చూపడం పార్టీని బలహీనపరుస్తోంది. దీనికి తోడు, నగర పాలక సంస్థలో అవినీతి, దందాలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు, ఫలితంగా టీడీపీ క్యాడర్ తీవ్రమైన మానసిక క్షోభకు లోనవుతోందట. ఈ పరిస్థితుల దృష్ట్యా, క్యాడర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందట. జె.బి. శ్రీనివాస్, మబ్బు నారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తే మూడు బలమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించి, పార్టీ బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ ఇన్‌ఛార్జ్‌ల నియామకంలో కూడా బలహీనులను పెట్టారనే విమర్శలున్నాయి.

సత్యవేడులో కన్వీనర్‌గా శ్రీపతి బాబు తొలగింపు:

సత్యవేడులో పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి వచ్చి, అందరి వ్యతిరేకత మధ్య విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తర్వాత జరిగిన పరిణామాలతో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా గ్రావెల్ మాఫియా చేసిన కుట్ర, ఓ మహిళా టీడీపీ నాయకురాలితో ఆయన వీడియో బయటకి రావడం వంటి వాటితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత శ్రీపతి బాబును కన్వీనర్‌గా నియమించినప్పటికీ, అధిష్టానం ఆయన్ను తొలగించి కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని ప్రోగ్రామ్ కన్వీనర్‌గా నియమించింది.. ఆయనే ఇన్‌ఛార్జ్‌గా చెప్పుకుంటున్నారు. శంకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే తన సామాజిక వర్గాన్ని మొత్తం పార్టీలోకి చేర్చి, వారికి అన్ని వ్యవహారాలు అప్పగించడంతో స్థానిక టీడీపీ క్యాడర్ తీవ్ర స్థాయిలో అగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా, ఓ దేవాలయం ధర్మకర్తల నియామకంలో వివాదస్పద మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్ రెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించడం, అనేక కేసులు ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించడం మరింత వివాదాన్ని రేపింది. ఇక్కడ కూడా తంబళ్లపల్లి మాదిరిగానే భవిష్యత్తులో పార్టీకి నష్టం చేకూర్చవచ్చని క్యాడర్ ఆందోళన చెందుతోంది.

కోల్డ్ స్టోరేజ్‌లో పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం:

ప్రతిష్టాత్మకమైన పుంగనూరు నియోజకవర్గంలోనూ ఇదే సమస్య తలెత్తింది. ఇన్‌ఛార్జ్ అయిన చల్లా బాబు రెడ్డి చుట్టూ ఉన్న కోటరీతో స్థానిక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ కోసం నష్టపోయిన, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయన కోటరీ తమను ఇబ్బంది పెడుతోందని, ముఖ్యంగా వైసీపీలో తమపై దాడులు చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపణలు వచ్చాయి. గతంలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త హత్యను కూడా దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. అధికారం చేతికి వచ్చినా, కార్యకర్తలు తమ అధికార దర్పం చూపించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం కూడా కోల్డ్ స్టోరేజ్‌లో ఉండిపోయింది.మొత్తం మీద, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మంత్రి ప్రాతినిధ్యం లేకపోవడం, సీనియర్ నాయకులు పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం వంటి పరిస్థితుల్లో, కొత్త ఇన్‌ఛార్జ్‌లు, అధ్యక్షుల నియామకం తర్వాత అయినా తమను పట్టించుకునే వారు ఉంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# నష్టం వివరాలు తెలుసుకున్న మంత్రి

భీమవరం, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పలుమార్లు పర్యటనలు చేసి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరఫునుండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు సైతం అధికారులతో సమన్వయం చేసుకొని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవాలని పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశర చేశారు. ప్రాథమిక అంచనాలో సుమారు 98 హెక్టార్ల అరటి తోటలు, 1800 హెక్టార్ల వరి పంట నేలకొరిగినట్లుఉద్యాన అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఉండ్రాజవరం, దమ్మేన్ను, పసలపూడి, కే సావరం, మోర్త, కాల్దారి తదితర గ్రామాలలో నివాసయోగ్యం కాని గృహాలలో నివసిస్తున్న 50 కుటుంబాలు, 170 మందికి, పునరావాసం కల్పించామన్నారు. వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్యవాడ, తదితర గ్రామాలలో మూడు రోజులపాటు మాంసం విక్రయాలు నిలిపి వేయాలని గ్రామంలో అవగాహన కల్పించినట్లు కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. తుఫాను ప్రభావాన్ని తట్టుకొని,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా, మండల విద్యుత్ శాఖ, కరెంటు తీగలపై చెట్టుకొమ్మలు పడకుండా నరికివేత, విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎలక్ట్రికల్ అధికారులు చెప్పారు. అప్పటివరకు వస్తూ, పోతూ ఉన్న విద్యుత్ సరఫరా భారీ గాలులతో సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు నెట్ సంబంధం తెగిపోయింది, ఇన్వెర్టర్లు మూగబోయాయి, అంధకారంలో, దోమల తో ప్రజలు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఏది ఏమైనా మండలంలో తుఫాను ప్రభావం విద్యుత్ సరఫరా పై అధికంగా పడిందని చెప్పుకోవాలి. కార్తీకమాసంలో నిర్వహించుకునే పిక్ నిక్ లు, వన సమారాధనలు తుఫాను ప్రభావంతో ఆ ఊసు లేకుండా పోయింది. సెలవులు రద్దుచేసి, పాఠశాలలో యధావిధిగా గురువారం కొనసాగాయి. అధికారులు, కూటమి పార్టీల నాయకులు నిర్వహించిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని, ముఖ్యంగా ఉండ్రాజవరం మండలంలో అధికారులు, నాయకులు చేపట్టిన ముందస్తు చర్యలు తనకు సంతృప్తినిచ్చాయన్నారు.

# మొంథా తుఫాన్‌తో భారీగా నష్టం

సిద్దిపేట,మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల - హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# నియమించవచ్చా?

హైదరాబాద్: రాష్ట్రంలోని ఓ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతుండగా, రాష్ట్ర మంత్రిగా ఎవరినైనా నియమించవచ్చా?. ఆ అసెంబ్లీ స్థానం పరిధిలో అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కాదా?. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ముఖ్యమంత్రి సిఫారసుల మేరకు గవర్నర్ కొత్త మంత్రిని నియమించవచ్చా?. ఈ సందేహాలకు కేంద్ర ఎన్నికల సంఘమే సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయ వర్గాలు స్పష్టం చేశాయి.జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి వచ్చే నెల 11న ఉప ఎన్నికలు జరగనుండగా, ఈ నెల 31న మాజీ క్రికెటర్ ముహమ్మద్ అజారుద్దీన్‌తో రాష్ట్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వచ్చే డిసెంబర్ ఏడో తేదీతో రెండేళ్లు పూర్తికానుండగా, ఇప్పటి వరకు రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లింలకు చోటు కల్పించలేదు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం పరిధిలో గణనీయ సంఖ్యలో ఉన్న ముస్లిం ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితిలో అజారుద్దీన్‌ను మంత్రిగా ప్రభుత్వం నియమించనుండటం ఆసక్తికరంగా మారింది.

నాడు సీఎంకు నేరుగా ఈసీ ఫోన్..

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా మంత్రివర్గంలో కొత్త మంత్రిని నియమించవచ్చా? గతంలో ఇలాంటి ఘటనలెక్కడైన జరిగాయా? అప్పుడు ఎన్నికల సంఘం ఏం చేసింది? అనే సందేహాలను కేంద్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా ఇటీవల హైదరాబాద్‌లో ఇచ్చిన ఓ ఉపన్యాసంలో నివృత్తి చేశారు. మంతన్ ఆధ్వర్యంలో గత సెప్టెంబర్ 13న నగరంలోని విద్యా అరణ్య పాఠశాలలో నిర్వహించిన సంస్థ సహ వ్యవస్థాపకుడు 'అజయ్ గాంధీ' స్మారక ఉపన్యాసంలో ఈ మేరకు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.గతంలో గోవాలోని ఓ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతుండగా, ఆ స్థానం పరిధిలో గణనీయ సంఖ్యలో ఉన్న సామాజికవర్గానికి సంబంధించిన ఓ వ్యక్తిని రాష్ట్రమంత్రిగా నియమించాలని అప్పటి సీఎం మనోహర్ పారికర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నాటి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ నేరుగా మనోహర్ పారికర్‌కు ఫోన్ చేసి ఉప ఎన్నికలు ముగిసే వరకు కొత్త మంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరారని అశోక్ లావాసా వెల్లడించారు. మంత్రుల నియాయకం విషయంలో రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను సైతం

# గీతం వర్సిటీ వేదికగా మూడురోజుల సభలు

విశాఖపట్నం, గీతం మెడికల్ కాలేజ్ ఆడిటోరియం వేదిక గా ఈ నెల అక్టోబర్ 31, నవంబర్ 1, 2 తేదీలలో రాష్ట్ర రేడియాలజిస్టుల వార్షిక మహాసభ జరుగనుందని ఎపిఐఆర్ఐఏ అధ్యక్షుడు డాక్టర్ వి. సురేష్ (డాల్ఫిన్ డయాగ్నస్టిక్స్) తెలిపారు. గురువారం ఉదయం విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ మహాసభలను పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ , రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సంయుక్తంగా ప్రారంభిస్తారని గీతం ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ గీతాంజలి బాట్ మానాభనే, ఎన్ఆర్ఐ రేడియాలజిస్టు డాక్టర్ ముక్కమాల అప్పారావు, నేషనల్ ఐఆర్ఐఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి. మోహన్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. సదస్సు మొదటి రోజు, అక్టోబర్ 31న, ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నామని రాష్ట్రంలో తొలిసారిగా సిమ్యులేషన్ పద్ధతిలో బ్రూణ దశలోని శిశువుపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్వెన్షన్ విధానాలైన అమ్నియోసెంటీసిస్, షంట్ ప్లేస్‌మెంట్‌లను ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నామని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు తమిళనాడుకు చెందిన డాక్టర్ భావహరణ్, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శిల్పా సతర్కర్, బెంగళూరుకు చెందిన డాక్టర్ కృష్ణ ప్రధాన ఫ్యాకల్టీగా వ్యవహరించ నున్నారని తెలిపారు. రెండవ ,మూడవ రోజుల్లో వైద్య ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈసారి రికార్డు స్థాయిలో 160 రేడియాలజీ పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. వీటిలో ఉత్తమ 12 పత్రాలను వేదికపై ప్రదర్శించి, అత్యుత్తమ మూడు పత్రాలకు పురస్కారాలు అందజేయనున్నామని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర స్థాయి రేడియాలజీ క్విజ్ నిర్వహించనున్నారు. దీనిని ఎయిమ్స్ న్యూ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాజుశర్మ నిర్వహించనున్నారు. ఆయనే ఈ సంవత్సరపు ప్రతిష్ఠాత్మకమైన 'కాకర్ల సుబ్బారావు ఉపన్యాసం'ను కూడా ఇవ్వనున్నారని అదేవిధంగా తిరుపతికి చెందిన ఎస్.వి.ఐ.ఎం.ఎస్. ప్రొఫెసర్ ఆఫ్ రేడియాలజీ డాక్టర్ ఎ. వై. లక్ష్మి కి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేయనున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 750 మంది రేడియాలజిస్టులు, వైద్య అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల రేడియాలజీ విభాగాధిపతులు హాజరై వైద్య విద్యలో కొత్త ధోరణులు, టెక్నాలజీ వినియోగం, రేడియాలజీ శిక్షణలో అభివృద్ధి మార్గాలు వంటి అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. ఈ సమావేశం సందర్భంగా ఎపి ఐఆర్ఐఏ జనరల్ బాడీ మీటింగ్‌లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ బుజ్జిబాబు (హెచ్.ఓ.డి., కె.జి.హెచ్.), ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ వర్మ (హెచ్.ఓ.డి., అపోలో ఆసుపత్రులు), డాక్టర్ రఘు (గీతం కళాశాల) పాల్గొన్నారు.

# కమిషనర్ కి నోటీసు ఇచ్చిన కాంట్రాక్టర్లు

విజయనగరం,నగర పాలక సంస్థ లో పలు అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసి, నవంబర్ 3 తేదీన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య కు నోటీసు ఇచ్చినట్లు కాంట్రాక్టర్లు తెలియజేశారు. గురువారం ఉదయం కమిషనర్ కు నోటీసు కాంట్రాక్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము గత 2 సంవత్సరము లుగా పూర్తి చేసిన పనులుకు ఈ నాటి వరకు బిల్లులు చెల్లింపులు జరగలేదన్నారు. దీనివలన మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అయినప్పటికినీ మీరు మమ్ములను పిలిచి క్రొత్తపనులకు టెండర్లు వేయండి పనులు చేసిన వెంటనే పేమెంటు ఇస్తానని చెప్పి మాట ఇచ్చారన్నారు. కానీ మేము సకాలంలో పనులు పూర్తి చేసినప్పటికి నేటి వరకు మాకు పేమెంటులు ఇవ్వటం జరగలేదన్నారు. గత బిల్లులు పేమెంట్సులు రాక క్రొత్త బిల్లులకు పేమెంటులు ఇవ్వకపోవడం వలన బ్యాంకుల నుండి మరియు ఇతర వ్యక్తుల నుండి తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని, మానసిక ఒత్తిడికి లోనువుతున్నామన్నారు. ఎన్ని ఇబ్బందులు పడుతున్నా మామీద త్వరితగతిన పనులు చేయమని మీరు మరియు ఇంజనీరింగు విభాగం వారు ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. అంతే కాకుండా మాకు నోటీసులు జారీచేస్తుయున్నారన్నారు. ఈ విషయమై మా కోర్ కమిటీ సభ్యులు తమ పిలుపుమేరకు తే 25-10-2025ది శనివారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు మీరు సమావేశం నిర్వహించారు. కానీ మీరు మాకోర్ కమిటీ సభ్యులు చర్చించిన అంశాలు పై మీ నుండి మాకు సానుకూల స్పందన రాకపోవటం వలన తే 03-11-20258 సోమవారం నుండి ప్రస్తుతం చేస్తున్న పనులు నిలుపుదల చేసి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు ఎదుట దర్నా చేయుటకు నిర్ణయించుకొని ఈ నోటీసు ద్వారా తెలియజేస్తున్నామన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగార్రాజు, అర్.రాజ్కుమార్, గౌరవ అధ్యక్షులు ఎం.లింగారావు,పి.అశోక్, సబ్యులు నరేంద్ర,పి.శ్రీనివాసరాజు, డి.శ్రీనివాస్, వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు,ఎం.శ్రీనివాస్,సత్యన్నారాయణ, సబ్యులు పాల్గొన్నారు.

# ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్ పనులు

హైదరాబాద్,ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్ వరకు జాతీయ రహదారి 44 పై ఎలివేటెడ్ కారిడర్ నిర్మాణం పనులు ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 30 నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్ నుండి బాలంరాయ్ వరకు రహదారిని మూసివేస్తున్నా మన్నారు. బాలంరాయ్ నుంచి సీటీవో జంక్షన్‌కు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బాలనగర్ వైపు నుంచి పంజాగుట్ట ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు తాడ్‌బంద్ మస్తాన్ కేఫ్, డైమండ్ పాయింట్ కుడివైపు మలుపు తిరిగి మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. సుచిత్ర వైపు నుంచి పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వారు సేఫ్ ఎక్స్‌ప్రెస్ ఎడమవైపు మలుపు తిరిగి బాపూజీనగర్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ రాణిగంజ్, పంజాగుట్ట, రసూల్‌పురా, ప్లాజా వైపు నుంచి సీటీఓ జంక్షన్ ద్వారా తాడ్‌బండ్ వైపు వెళ్లేవారు రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ నుంచి అన్నానగర్, బాలంరాయ్, తాడ్‌బంద్ ద్వారా పంజాగుట్ట, ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు మీటింగ్ పాయింట్ బైలేన్, హాకీ గ్రౌండ్ బైలేన్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ మార్గాలను ఉపయోగించాలని జాయింట్ సీపీ సూచించారు. ట్రాఫిక్ సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫారంలను చూడవచ్చని, ప్రయాణ సమయంలో అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కి కాల్ చేయవచ్చన్నారు.

# బీహార్‌లో ఎన్డీఏకి నితీష్‌కుమారే దిక్కు.. ఎందుకంటే?



పాట్నా:ఇండియా పొలిటికల్ అటెన్షన్ అంతా.. ఇప్పుడు బీహార్ వైపే ఉంది. ఈసారైనా.. అక్కడ సర్కార్ మారుతుందా? లేక నితీశ్ కుమార్ ప్రభుత్వానికే ప్రజలు మళ్లీ పట్టం కడతారా? అనే సస్పెన్స్ నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో.. ఢిల్లీ లెవెల్ లీడర్లు బీహార్ గడ్డ మీద చేసే కామెంట్లు.. అక్కడి రాజకీయం కొత్త టర్న్ తీసుకునేలా చేస్తున్నాయి. ఎన్నికల ర్యాలీలో.. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు కూడా అలాంటివే. రాజకీయాల్లో ఖాళీ సీట్లు లేవని.. నరేంద్రమోడీ పీఎంగా, నితీశ్ కుమార్ సీఎంగా కొనసాగుతారని.. అమిత్ చేసిన స్టేట్‌మెంట్.. బీహార్ సహా మిగతా స్టేట్స్‌లోనూ పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. అసలు.. నితీశే సీఎం అభ్యర్థి అని బీజేపీ ఎందుకు చెబుతోంది? ఆయనకు వయసు మీద పడింది. నితీశ్ సుదీర్ఘ పాలనపై ఎన్నో విమర్శలున్నాయ్. జనంలో వ్యతిరేకతతో పాటు ఆయన హయాంలో స్కాములు జరిగాయనే ఆరోపణలున్నాయ్. అయినా సరే.. నితీశ్ కుమార్‌నే బీజేపీ నెక్స్ట్ సీఎంగా ప్రొజెక్ట్ చేస్తోంది. ఇందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయ్. ఇది ఎన్డీయే కూటమికి అనివార్యమైన రాజకీయ అవసరంగా కనిపిస్తోంది. ముఖ్యంగా నితీశ్ కుమార్‌కు ఉన్న అతిపెద్ద బలం ఈబీసీ ఓట్ బ్యాంక్. అత్యంత వెనుకబడిన తరగతులు, మహాదళిత్‌ల మద్దతు ఆయనకు పుష్కలంగా ఉంది. ఈ వర్గాలే బీహార్ ఎన్నికలలో డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నాయి. బీజేపీ తన సంప్రదాయ ఓట్ బ్యాంకుతో పాటు, నితీశ్ ద్వారా ఈ కీలకమైన ఈబీసీ ఓట్లను తమ వైపు ఆకర్షించాలని చూస్తోంది. అందువల్ల నితీశ్ కుమార్ నాయకత్వాన్ని తిరస్కరిస్తే.. ఆయన మరోసారి కూటమి మారతారేమోనన్న ఆందోళన బీజేపీ నాయకత్వంలో కనిపిస్తోంది. ఎందుకంటే. గతంలో రెండు సార్లు నితీశ్ బీజేపీని వీడారు. కూటమి విచ్ఛిన్నం కాకుండా స్థిరంగా ఉంచేందుకు నితీశే నెక్స్ట్ సీఎం అని.. ఆయన తర్వాతే తామని చెప్పడం బీజేపీకి తప్పనిసరి అవుతోంది.మరోవైపు నితీశ్ కుమార్‌ని బీహార్ ప్రజలు ఇప్పటికీ.. లాలూ ప్రసాద్ యాదవ్ హయాంలోని జంగిల్ రాజ్‌కు పూర్తి విరుద్ధంగా చూస్తారు. దాదాపు రెండు దశాబ్దాలుగా బీహార్‌కు పాలనా స్థిరత్వాన్ని ఇచ్చింది నితీశ్ నాయకత్వమే. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ యువ నాయకుడు తేజస్వి యాదవ్‌ని సీఎం అభ్యర్థిగా బరిలో నిలిపినప్పుడు, ఆయనకు వ్యతిరేకంగా అనుభవజ్ఞుడైన, అవినీతి మరకలు లేని నితీశ్‌ని నిలబెట్టడం బీజేపీకి సులభమవుతుంది. పాలనా స్థిరత్వం వర్సెస్ అరాచకత్వం అనే నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లడానికి నితీశ్ కంపల్సరీ అవుతారనే చర్చ జరుగుతోంది. కానీ ఇక్కడంతా ఒప్పుకోవాల్సిన నిజం ఏమిటంటే, నితీశ్ కుమార్‌కు వయసు మీద పడింది. ఆయన పాలనపై ఇప్పుడు విమమర్శలు వినిపిస్తున్నాయ్. జనంలోనూ జేడీయూ హయాంపై వ్యతిరేకత ఉన్న విషయం వాస్తవమే. అయితే, ఈ వ్యతిరేకతను బీజేపీ తనపై పడకుండా చూసుకునేందుకే.. నితీశ్‌ని ముందుంచుతోందనే వాదన వినిపిస్తోంది. నితీశే సీఎం అభ్యర్థిగా ఉంటే, రాజకీయ ప్రత్యర్థులు విమర్శలన్నీ ఆయన, ఆయన పార్టీ జేడీయూ లక్ష్యంగానే ఉంటాయి. దీని ద్వారా బీజేపీ కొంత రిలాక్స్ అయ్యే అవకాశం ఉంది. పైగా ఈ వ్యతిరేకతని అధిగమించేందుకు.. బీజేపీ తరచుగా డబుల్ ఇంజిన్ సర్కార్ స్లోగన్‌ని హైలైట్ చేస్తూ వస్తోంది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, నితీశ్ నాయకత్వంలోని బీహార్ పాలనని కలిపి.. డబుల్ ఇంజిన్ సర్కార్ చేపట్టిన ప్రోగ్రెస్‌గా ప్రచారం చేస్తోంది. దాంతో, నితీశ్‌పై వ్యతిరేకత ఉన్నా.. మోడీ ఇమేజ్‌తో దాన్ని అధిగమించాలని చూస్తోంది.కొన్ని రోజుల కిందటి వరకు, బీజేపీ నాయకత్వం వ్యూహాత్మకంగా ఎన్నికలు నితీశ్ నాయకత్వంలో జరుగుతాయి. సీఎంని ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారనే ద్వంద్వ వైఖరిని అవలంబించింది. కూటమి భారీ మెజారిటీ సాధించి, బీజేపీకి అత్యధిక సీట్లు వస్తే, ఎన్నికల తర్వాత బీజేపీ తమ సొంత నాయకుడిని సీఎం చేయాలనే ఆలోచనతో ఉన్నట్లుగా గుసగుసలు వినిపించాయ్. కానీ, ఇప్పుడు బీజేపీ స్వరం మారింది. నితీశ్ కుమార్‌ని సీఎం అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా, కూటమిలో చీలిక రాకుండా, ఎన్నికల్లో విజయం సాధించడంపై దృష్టి పెట్టింది. పైగా, బీహార్‌లో నితీశ్ కుమార్‌కు.. మంచి పాలన అందించిన నాయకుడిగా.. సుశాసన్ బాబు అనే ఇమేజ్ ఉంది. నితీశ్ పాలనలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, ఎంతో కొంత అభివృద్ధి జరిగిందనే నమ్మకం ప్రజల్లో ఉంది. కానీ.. ఈ ఇమేజ్ ఇప్పుడు అంత స్ట్రాంగ్‌గా లేదనే చర్చ జరుగుతోంది. దాదాపు 20 ఏళ్ల పాటు నితీశ్ కుమార్ సీఎంగా కొనసాగటం వల్ల.. ప్రజల్లో సహజంగానే కొంత పాలనపై వ్యతిరేకత పెరుగుతుంది. ఇప్పుడు బీహార్‌లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. అందువల్ల.. ప్రత్యర్థి పార్టీల విమర్శలకు దీటుగా.. నితీశ్ నాయకత్వాన్ని ముందుంచడమే బెటరని బీజేపీ భావించి ఉండొచ్చంటున్నారు.గతంలో.. నితీశ్ కుమార్ నాయకత్వంలోనే.. ఎన్డీయే కూటమికి మంచి ఫలితాలు వచ్చాయి. కూటమి విజయం కోసం, ప్రధానంగా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటుని.. నితీశ్ వైపు మళ్లించే వ్యూహం కూడా అయి ఉండొచ్చన్న చర్చ జరుగుతోంది. అయితే.. కొన్ని వర్గాలు నితీశ్‌పై వస్తున్న సహజ వ్యతిరేకతని, వయోభారం లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని.. ఎన్నికల తర్వాత ఫలితాలను బట్టి సీఎంను ఖరారు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. కానీ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో.. కూటమిని సమష్టిగా ముందుకు నడిపించడంలో.. నితీశ్ కుమారే కీలకంగా ఉన్నారు. సింపుల్‌గా చెప్పాలంటే.. నితీశ్ కుమార్ పర్సనల్ ఇమేజ్ బలహీనపడినా.. బీహార్‌లోని కీలకమైన ఓట్ బ్యాంకుని నిలుపుకునేందుకు.. రాజకీయ స్థిరత్వం కోసం బీజేపీకి ఆయన తప్పనిసరిగా కావాలి. ఇక.. బీహార్‌లో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం, వలసలు కొనసాగడం లాంటి సమస్యల వల్ల.. యువ ఓటర్లు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. యువ నాయకుడు తేజస్వి యాదవ్.. భారీగా ఉద్యోగాలు, మార్పును తెస్తాననే హామీలు.. వారిపై ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. దీనికితోడు.. నితీశ్ కుమార్ తరచుగా కూటములను మార్చడం వల్ల.. ప్రతిపక్షాలు ఆయన్ని.. పల్టూ రామ్ అని విమర్శిస్తున్నాయ్. ఇది.. ఆయన విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇప్పుడు నితీశే సీఎంగా ఉంటారనే అమిత్ షా ప్రకటన కూడా.. కూటమిలో అంతర్గత అనిశ్చితి రేకెత్తించే అవకాశం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయ్. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్జేపీ పార్టీ బలం పెరిగింది. నితీశ్-చిరాగ్ మధ్య పాత వైరుధ్యాలు కూటమి సమన్వయాన్ని దెబ్బతీయొచ్చనే చర్చ జరుగుతోంది.మరోవైపు.. బీహార్‌లో యాదవులు, ముస్లింలు.. ఆర్జేడీ, కాంగ్రెస్ ఉన్న కూటమికి మద్దతుగా ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో.. బీహార్‌ని గెలవాలంటే.. ఆ రెండూ కాకుండా బలమైన ఓట్ బ్యాంక్ కావాలి. నితీశ్ కుమార్ తన పాలన ద్వారా.. ఈబీసీలు, మహిళా ఓటర్ల మద్దతుని కూడగట్టుకన్నారు. ఈ ఓట్ బ్యాంక్ బీజేపీకి లేదు. బీహార్‌లో విజయం సాధించాలంటే.. ఎన్డీయే కూటమికి ఈ రెండు వర్గాల ఓట్లు చాలా కీలకం. అందువల్లే నితీశ్ నాయకత్వాన్ని బలపరుస్తోంది బీజేపీ. అమిత్ షా స్టేట్‌మెంట్‌తో.. ఈ సందేశం బీహార్ ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అంతేకాదు.. మహాఘట్‌బంధన్.. నితీశ్‌ని సీఎం అభ్యర్థిగా ప్రకటించకుండా.. బీజేపీ డబుల్ గేమ్ ఆడుతోందనే విమర్శల్ని తిప్పికొట్టేందుకు కూడా.. ఈ ప్రకటన పనిచేస్తుందని బీజేపీ భావించి ఉండొచ్చు. మరీ.. ముఖ్యంగా తేజస్వి యాదవ్ మార్పు నినాదంతో ప్రచారం చేస్తున్నారు. అందువల్ల.. ఆయనను ఎదుర్కొనేందుకు.. పరిపాలనలో అనుభవం ఉన్న నితీశ్ కుమార్ కంటే.. బెటర్ ఫేస్ ఎన్డీయేకు మరొకటి లేదు. ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి గనక ఎక్కువ సీట్లు వస్తే.. నితీశ్‌ని సీఎం కుర్చీలో కూర్చోబెట్టి.. అధికారాన్ని, కూటమిపై పట్టును కొనసాగించొచ్చనే ఆలోచన కూడా బీజేపీ ఉండొచ్చు. మొత్తంగా.. నితీశ్ కుమార్ ఓట్ బ్యాంకుని ఉపయోగించుకొని.. ఎన్నికల్లో విజయం సాధించడం, తర్వాత కూటమిలో తన ఆధిపత్యాన్ని పెంచుకోవడం కోసమే.. బీజేపీ నితీశ్ కుమార్‌ని సీఎంగా ప్రొజెక్ట్ చేస్తోందనే చర్చ జోరుగా సాగుతోంది.

# సహాయ,పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి !



మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్ధరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల

# కొత్తగా మరో 6 స్కైవాక్స్ నిర్మాణం..

హైదరాబాద్,పెరుగుతున్న పట్టణ ట్రాఫిక్, జంక్షన్ల రద్దీ దృష్ట్యా హైదరాబాద్ మహానగరంలో పాదచారుల భద్రత, సౌకర్యార్థం మరో ఆరు ప్రాంతాల్లో స్కైవాక్స్ నిర్మించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు వేగవంతం చేసింది. నగరంలో మొత్తం 23 కీలక ప్రాంతాల్లో స్కైవాక్స్ అవసరమని హెచ్ఎండీఏ గతంలో గుర్తించగా.. ఈ ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో స్కైవాక్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ముందుగా ఆరు ప్రాంతాలలో స్కైవాక్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం హెచ్ఎండీఏను ఆదేశించింది. అఫ్జల్‌గంజ్, మదీన, లక్డీకాపూల్ పెట్రోల్‌బంక్, బీహెచ్ఈఎల్, జేఎన్‌టీయూ (కూకట్‌పల్లి), మియాపూర్ టీ జంక్షన్లలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. హెచ్ఎండీఏ ఇప్పటికే ఉప్పల్ జంక్షన్ వద్ద అత్యాధునిక స్కైవాక్ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కైవాక్ పాదచారులు ట్రాఫిక్ రద్దీ లేకుండా సాఫీగా ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి సులభతరం చేసింది. దీనితోపాటు మెహదీపట్నం వద్ద చేపట్టిన భారీ స్కైవాక్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. త్వరలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ వద్ద మరో స్కైవాక్ నిర్మాణం కూడా ప్రారంభం కానుంది. ప్రస్తుతం అత్యంత రద్దీగా ఉన్న ప్రాంతాల్లో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్ ఒకటి. ఇక్కడ ట్రాఫిక్ జామ్‌తో పాటు పాదచారుల రద్దీ విపరీతంగా పెరిగి, రోడ్డు దాటడం గగనంగా మారింది. పాదచారుల అడ్డగింత కూడా ట్రాఫిక్ జామ్‌కు ఒక కారణంగా మారుతున్న నేపథ్యంలో ఉప్పల్ తరహాలో ఇక్కడ కూడా భారీ స్కైవాక్ నిర్మించాలని హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ స్కైవాక్ జేఎన్‌టీయూ జంక్షన్, మెట్రో స్టేషన్, బస్‌స్టేషన్, ప్రముఖ లూలూ మాల్ వంటి కీలక ప్రాంతాలను అనుసంధానించే విధంగా రూపొందించనున్నారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌ను కేంద్రంగా చేసుకొని నిర్మించే ఈ స్కైవాక్‌ను ఒక 'స్పెషల్ హబ్'గా తీర్చిదిద్దాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇది మెట్రో స్టేషన్, లూలూ మాల్‌తో పాటు ప్రగతినగర్, నిజాంపేట్ మార్గాల వైపు వెళ్లే పాదచారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయితే జేఎన్‌టీయూ క్యాంపస్ పరిసర ప్రాంతం పాదచారులకు విశ్రాంతి జంక్షన్‌గా మారనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.సికింద్రాబాద్‌లో కూడా రైల్వేస్టేషన్, మెట్రో స్టేషన్లు, బస్‌స్టాండ్‌లను అనుసంధానం చేస్తూ ఒక స్కైవాక్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏ డిజైన్లను సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టులతో నగరంలో పాదచారుల భద్రత, రవాణా సౌలభ్యం మరింత మెరుగుపడనున్నాయి.

# కుదిపేస్తున్న స్కామ్

చెన్నై:తమిళనాడు రాష్ట్రాన్ని కుదిపేసే రీతిలో ఓ భారీ ఉద్యోగ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో నియామకాల కోసం ఏకంగా కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరిపిన దర్యాప్తులో తేలడంతో ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి.

నియామకాల్లో భారీ రిగ్గింగ్: ఈడీ నివేదిక

రాష్ట్రంలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో జరిగిన నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. ఒక్కో ఉద్యోగం కోసం ఏకంగా రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2024లో అసిస్టెంట్ ఇంజినీర్లు, జూనియర్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వంటి పోస్టుల కోసం రిక్రూట్‌మెంట్ జరిగింది. సుమారు 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్ష అనంతరం 2,538 మందిని ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా ఆగస్టులో నియామక ఉత్తర్వులు అందజేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది.

బయటపడిన నిజాలు

ఈడీ దర్యాప్తులో సుమారు 150 మందికి అనుకూలంగా రిగ్గింగ్ జరిగినట్లు బయటపడింది. లంచాలు చెల్లించి అభ్యర్థులు పరీక్షల్లో అనుకూల ఫలితాలు పొందినట్లు నివేదిక స్పష్టం చేసింది. దీని వెనుక రాజకీయ నాయకులు, మధ్యవర్తులు, పరీక్ష నిర్వహణలో పాల్గొన్న సంస్థల మధ్య పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు ఈడీ గుర్తించింది.

- 232 పేజీల ఆధారాలు, అన్నా యూనివర్సిటీపై విచారణకు డిమాండ్

ఈడీ తన దర్యాప్తు ఫలితాలను వివరిస్తూ 232 పేజీల నివేదికను తమిళనాడు పోలీసు విభాగానికి పంపింది. నివేదికలో సంబంధిత వ్యక్తుల బ్యాంకు లావాదేవీలు, ఆడియో వీడియో రికార్డులు, లంచం చెల్లింపుల వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యత వహించిన అన్నా యూనివర్సిటీపై కూడా విచారణ జరపాలని ఈడీ డిమాండ్ చేయడం గమనార్హం.

రాజకీయ దుమారం: ప్రభుత్వ ప్రతిష్ఠకు దెబ్బ

ఈ జాబ్ స్కామ్ వార్త తమిళనాడు రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది."ప్రజల భవిష్యత్తుతో ఆటలు ఆడటం సిగ్గుచేటు" అంటూ టీవీకే నేతలు మండిపడ్డారు. అయితే ఇప్పటివరకు తమిళనాడు ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి స్టాలిన్ గానీ ఈ అంశంపై స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ కుంభకోణం రాజకీయంగా పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసు తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠకు పెద్ద దెబ్బతీస్తుందనే విషయం మాత్రం స్పష్టం.

# భారీ వర్షాలకు నిండుకుండలా ప్రాజెక్టులు

గుంటూరు,ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. పల్నాడు జిల్లాలోని పులిచింతల రిజర్వాయర్ కు భారీ వరద నీరు చేరుకుంది. దీంతో ప్రాజెక్ట్ 9 గేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. వరద ఇన్ ఫ్లో 5లక్షల వరుకు చేరే అవకాశం ఉన్నందున ముందుగానే దిగువకు 4.9లక్షల క్యూసెక్కులు నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీని వలన ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. లోతట్టు ప్రాంత లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతుంది. దీంతో జలాశయం వద్ద సైరన్ మోగించి మృత్యకారులకు హెచ్చరికలను జారీ చేశారు.అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని రజాల గ్రామం దగ్గర శారదా నదికి గండి పడింది. దీంతో ఉధృతంగా ప్రవహిస్తున్న శారద నది అక్కడున్న వందల ఎకరాల్లో ఉన్న పంట భూములను నేలమట్టం చేసింది. శారద నది ఉధృతికి శంకరం దగ్గర 100 ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. దీంతో హరిజాల గ్రామం పూర్తిగా వరద నీటిలో చిక్కుకున్నది. ప్రకాశం బ్యారేజి వద్ద ప్రస్తుతానికి ఇన్ ఎ÷-లో, ఔట్ ఎ÷-లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. వరద ఎ÷-లో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉండగా, క్రమంగా వరద తగ్గే అవకాశం ఉంది. లంక గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

# కేటీఆర్ నాయకత్వానికి పెను సవాల్..



హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారింది. పార్టీ అధినేత కేసీఆర్ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. సీనియర్ నేత హరీశ్ రావు తండ్రి మరణించడంతో ఆయన అనూహ్యంగా ప్రచారానికి దూరమయ్యారు. దీంతో పార్టీ గెలుపు బాధ్యత మొత్తం కేటీఆర్ పై పడింది. పదేళ్లు అధికారంలో కొనసాగిన పార్టీ.. గత రెండేళ్లుగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకవైపు అధికారపార్టీ అన్నివిధాలుగా పైచేయి సాధించడానికి ప్రయత్నించడం, మరోవైపు నుంచి తమ స్థానాన్ని లాక్కోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో జూబ్లీహిల్స్ స్థానాన్ని నిలబెట్టుకోవడం బీఆర్ఎస్ వర్కింగు ప్రెసిడెంటుగా కేటీఆర్ కు అత్యంత ప్రధానమంటున్నారు.జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. పదేళ్లుగా ఇక్కడ కారు పార్టీకి ఎదురులేకుండా ఉంది. ఎమ్మెల్యే గోపీనాథ్ మరణంతో అనూహ్యంగా వచ్చిన ఉప ఎన్నికలో మళ్లీ గెలవడం బీఆర్ఎస్ కు అత్యావసరం అంటున్నారు. ఈ స్థానంలో గెలవడం వల్ల పార్టీకి ఒనగూరే ప్రయోజనం పెద్దగా ఏమీ లేకపోయినా, రిజల్ట్ తేడా వస్తే జరిగే నష్టం మాత్రం చాలా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. అధినేత కేసీఆర్ గైర్హాజరు, సీనియర్ నేత హరీశ్ రావు రాలేని పరిస్థితుల్లో ఫలితం ఎలా ఉన్నా, దానికి కేటీఆర్ బాధ్యత వహించాల్సివున్నందున జూబ్లీహిల్స్ గెలిపించడం ఆయన భవిష్యత్తుకు కీలకంగా చెబుతున్నారు.పార్టీలో నెంబర్ టు గా ఉన్న కేటీఆర్.. కొద్దిరోజుల్లోనే నెంబరు వన్ స్థానాన్ని అందుకోవాలని చూస్తున్నారు. ఈ స్థానం కోసం పోటీపడిన చెల్లి కవిత.. ఆ స్థానం దక్కదనే ఆలోచనతో ఇప్పటికే తప్పుకున్నారు. ఇక కేటీఆర్ కు పోటీగా భావిస్తున్న ఇతర నేతలు కూడా ప్రస్తుతం సైలెంటుగానే ఉన్నారు. మరోవైపు తండ్రి, బీఆర్ఎస్ అధినేత సైతం కేటీఆర్ కు పూర్తి బాధ్యతలు అప్పగించేందుకు తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం అధికారం కోల్పోవడంతో అధ్యక్ష పదవిని కేటీఆర్ కు అప్పగించడానికి కేసీఆర్ వెనక్కి తగ్గారని అంటున్నారు. ప్రతిపక్షంలో బాధ్యతలు బదిలీ చేయడం తగిన సమయం కాదన్న ఆలోచనతోనే అధినేత కొంత సమయం తీసుకోవాలని నిర్ణయించారని చెబుతున్నారు.ఇదే సమయంలో పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చిన నుంచి మొత్తం బాధ్యతలు కేటీఆర్ కే అప్పగించారు. గత రెండేళ్లుగా పార్టీ కార్యక్రమాలు అన్ని కేటీఆర్ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. కేసీఆర్ ఎక్కడా కనిపించడం లేదు. ఎర్రవెల్లి ఫాం హౌస్ కే పరిమితమైన అధినేత అప్పుడప్పుడు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అవసరమైన సలహాలు, సూచనలకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఫలితం ఎలా ఉన్నా అందుకు కారణం కేటీఆర్ అవుతారని అంటున్నారు. ప్రస్తుతం ప్రచారం మొత్తం తన భుజస్కందాలపై వేసుకున్న కేటీఆర్.. అధికార పార్టీ కాంగ్రెస్ కు దీటుగా దూసుకుపోతున్నారు.అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ జూబ్లీహిల్స్ తన్నుకుపోవాలని అధికార కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి. సీఎం రేవంత్ తోపాటు మంత్రులు మొత్తం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మోహరించి, క్షేత్రస్థాయిలో పనిచేయాలని నిర్ణయించడం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఒత్తిడికి గురిచేస్తోందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీ వ్యూహాలకు ప్రతివ్యూహాలు రచించి, పార్టీ అభ్యర్థి సునీతను గెలిపించడం కేటీఆర్ కు కత్తిమీద సాములా మారిందని అంటున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో నెగ్గుకురావడం అంటే చిన్నవిషయమే కాదన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీలకు రకరకాల సానుకూలతలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఆ రెండు పార్టీలకు అధికారం అనే బలం అదనపు అడ్వాంటేజ్ గా మారింది. కానీ, బీఆర్ఎస్ పార్టీ అన్నిరకాలుగా ఎదురీదాల్సివస్తోంది. ఇలాంటి సమయంలో పార్టీని గెలిపించి తన భవిష్యత్తును కేటీఆర్ ఎలా తీర్చిదిద్దుకుంటారో చూడాల్సివుందని అంటున్నారు.

# బీజేపీలో ఆ ఫైర్ ఏమైంది? జూబ్లీహిల్స్ టాక్ లో ఎక్కడుంది?

హైదరాబాద్,తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని భావిస్తున్నభారతీయ జనతా పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సవాల్ విసురుతున్నాయి. ప్రధాన పోటీదారుగా గట్టిపోటీ ఇస్తున్నప్పటికీ 2018-23 మధ్య జరిగిన నాలుగు ఉప ఎన్నికలతో పోల్చి చూస్తే, అప్పట్లో కనిపించిన జోరు, ఇప్పుడు తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో నాలుగు అసెంబ్లీ ఎన్నికలకు ఉప ఎన్నికలు జరిగితే, రెండు చోట్ల విజయం సాధించడంతో పాటు మరోచోట గట్టిపోటీ ఇచ్చి ద్వితీయస్థానంలో బీజేపీ నిలిచింది. అయితే తాజా ఉప ఎన్నికతోపాటు గతంలో జరిగిన కంటోన్మెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ వాయిస్ పెద్దగా వినిపించడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా, గత రెండేళ్ల నుంచి కాంగ్రెస్ సర్కారు పాలిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత బలమైన శక్తిగా ఎదగాలని బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. గత ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీని వెనక్కినెట్టి తామే బీజేపీనే ప్రబల శక్తిగా పోటీపడింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో రికార్డు స్థాయి విజయం సాధించింది. ఆ రెండు ఉప ఎన్నికల్లో అప్పటి అధికార పక్షం బీఆర్ఎస్ కు ఝలక్ ఇచ్చిన కమలదళం.. హస్తం పార్టీని మూడోస్థానానికే పరిమితం చేసింది. ఇక మునుగోడు ఉప ఎన్నికల్లో విజయం వరకు వచ్చి ఆగిపోయింది. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ సిట్టింగు స్థానాన్ని కోల్పోవడమే కాకుండా కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. దీని అంతటికీ కారణం బీజేపీ కేడర్ పోరాటమే అని చెప్పకతప్పదనే అభిప్రాయం ఉంది.అయితే 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత కమలం పార్టీలో గతంలో ఉన్న ఊపు కనిపించడం లేదనే అంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 అసెంబ్లీ స్థానాలు తెచ్చుకున్న బీజేపీ.. ఆ తర్వాత ఆర్నెల్లకు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బలమైన శక్తిగా ఎదిగింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను నామరూపాల్లేకుండా చేసి అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా 8 చోట్ల విజయం సాధించింది. అయితే ఆ తర్వాత ఏమైందో కానీ, బీజేపీలో స్పీడు తగ్గినట్లు కనిపిస్తోందని సొంత కార్యకర్తలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధానంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక, ప్రచారం తీరును ఉదాహరణగా చూపుతున్నారు.




జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గత రెండుసార్లు బీఆర్ఎస్ పార్టీ గెలవగా, ఈ నియోజకవర్గం ఉన్న సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 నుంచి వరుసగా సికింద్రాబాద్ నుంచి గెలుస్తున్న కిషన్ రెడ్డికి జూబ్లీహిల్స్ గెలుపు ఒక విధంగా ప్రతిష్ఠాత్మకంగానే చెబుతున్నారు. ఆయన కూడా జూబ్లీహిల్స్ పై ప్రత్యేక ఫోకస్ చేసినా, కాంగ్రెస్, బీఆర్ఎస్ తో పోల్చుకుంటే క్షేత్రస్థాయిలో బలమైన ముద్ర వేయలేకపోతున్నారని కార్యకర్తల నుంచి నిరసన ఎదుర్కొంటున్నారు. ప్రచారంలో మిగిలిన రెండు పార్టీలు దూసుకుపోతుంటే, కమలం పార్టీలో మాత్రం ఆ స్థాయిలో హడావుడి కనిపించడం లేదని టాక్ వినిపిస్తోంది.కాంగ్రెస్ పార్టీ ప్రతి డివిజన్ కు ఇద్దరు మంత్రులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా బీఆర్ఎస్ సైతం పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావును రంగంలోకి దింపింది. వీరికి సహాయంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. కానీ, బీజేపీలో అభ్యర్థి దీపక్ రెడ్డితోపాటు కొద్దిమంది నాయకులే కనిపిస్తున్నారని అంటున్నారు. గతంలో దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ లో గట్టిగా ప్రచారం జరగడం లేదని, నేతలు దూసుకుపోవడం లేదని అంటున్నారు.

# బ్రదర్ ఆఫ్ కోమటిరెడ్డి...సంచలన నిర్ణయమా ?

నల్లగొండ:నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి సోదరుల హవా గురించి వేరేగా చెప్పాల్సింది లేదు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజగోపాల్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా ఉంటారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కి పట్టున్న ప్రాంతం. ఇక్కడ నుంచి ఎందరో దిగ్గజ నేతలు కాంగ్రెస్ నుంచి ఏలారు. వర్తమానంలో చూస్తే కోమటిరెడ్డి బ్రదర్స్ చక్రం తిప్పుతున్నారు. ఈ ఇద్దరూ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు నిత్యం వార్తలలో ఉండేవారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరి మునుగోడు ఉప ఎన్నికలో పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు కానీ అప్పట్లో అది అతి పెద్ద సంచలనమైంది.

కాంగ్రెస్ లో చేరినా :

ఇక చూస్తే 2023 ఎన్నికల ముందు కాంగ్రెస్ లో తిరిగి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేరారు. ఆయన ఈసారి కూడా మునుగోడు నుంచి పోటీ చేసి గెలిచారు. మంత్రి కావాలని ఆశ పడ్డారు. అయితే అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి అయ్యారు ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వరని సమీకరణలు సరిపోవని తేల్చడంతో ఆయన భారీ నిరాశకు గురి అయ్యారు. ఆనాటి నుంచి ఆయన వార్తలలో నిలుస్తూ తనదైన హాట్ కామెంట్స్ చేస్తూ వస్తున్నారు. ఆయన మాటల వైఖరి చూసిన వారు అధికార పక్షంలో విపక్షం అన్నట్లుగా చెప్పుకునే సందర్భాలు ఉన్నాయి.

పార్టీ మారుతున్నారా :

అయితే సడెన్ గా ఇపుడు కొత్త ప్రచారం ఊపందుకుంది సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఆ ప్రచారం సారాంశం ఏమిటి అంటే మరోసారి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారుతున్నారు అని. ఆయన కాంగ్రెస్ లో సంతృప్తిగా లేరని అందుకే పార్టీని వీడుతున్నారు అన్నది వైరల్ గా చేస్తున్న వ్యవహారంగా ఉంది. నిజానికి చూస్తే కాంగ్రెస్ హైకమాండ్ రాజగోపాల్ రెడ్డిని కాంగ్రెస్ లో చేర్చుకునే ముందు ఒక భారీ హామీ ఇచ్చిందంట. ఆయనకు మంత్రి పదవి తప్పకుండా ఇస్తమాని కూడా పేర్కొంది. ఇక తనకు హోం మంత్రి కావాలని ఉందని కూడా అప్పట్లో రాజగోపాల్ రెడ్డి తన సన్నిహితులతో చెప్పుకున్నారని అంటారు. తీరా చూస్తే ఆయనకు మంత్రి పదవే దక్కలేదు

క్లారిటీ ఇచేసినట్లేనా :

అయితే తాను పార్టీ మారుతున్నట్లుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం



పూర్తిగా తప్పు అని రాజగోపాల్ రెడ్డి ఖండిస్తున్నారు. తాను కాంగ్రెస్ లోనే ఉంటాను అని ఎక్కడికీ వెళ్ళే ప్రసక్తి లేదని ఆయన అంటున్నారు. తన మీద పనిగట్టుకుని కొందరు చేస్తున్న దుష్ప్రచారం ఇదంతా అని ఆయా అంటున్నారు. తాను ఒకవేళ ఏ నిర్ణయం అయినా తీసుకున్నా అది మీడియాకు చెప్పే చేస్తాను తప్ప తెర చాటున చేయడం అన్నది ఉండదని పక్కా క్లారిటీ ఇస్తున్నారు. ఇదంతా తన మీద జరుగుతున్న కుట్రగా ఆయన అభివర్ణించారు. తాను కాంగ్రెస్ కి ఎంతో నమ్మకం కలిగిన కార్యకర్తను అన్నారు పార్టీ మారడం అన్న ప్రశ్నే ఉండదని అధినాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి పనిచేసే స్వభావం తనదని ఆయన అంటున్నారు. మొత్తం మీద చూస్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీద ఎవరు కుట్ర చేస్తున్నారు ఆయన పార్టీ మారుతున్నారు అని ఎవరు ప్రచారంలోకి తెచ్చారు అన్నది చర్చ సాగుతోంది. కోమటిరెడ్డి అయితే తాను కాంగ్రెస్ లోనే ఉంటాను ఇదే సత్యం అని చెబుతున్నారు. సో తెలంగాణా కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రస్తుతం ఇది ఒక కొత్త చర్చగా సాగుతోంది.

### విమానంలో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

హైదరాబాద్,జెడ్డా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా చాతీలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పారు.

# ఆమె వయసు ఎంత..? వాడి వయసు ఎంత..? శారీరకంగా చేరువై.. చివరకు..



నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి పీఎస్ పరిధిలో ఈ నెల 8న ఓ మహిళ హత్య వెలుగు చూసింది. సదరు మహిళ మృతదేహాన్ని దహనం చేయడంతో జిల్లాలో తీవ్ర సంచలనంగా మారింది.హత్య, అనంతరం దహనం చేయడంతో ఎలాంటి ఆనవాళ్లు లేకుండా చేశారు. దీంతో కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు కొద్దిరోజుల్లోనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. ప్రియురాలిని పెళ్లి చేసుకునేందుకు తనతో శారీరక సంబంధం ఉన్న ఓ మహిళ అడ్డుపడుతుంది. దీంతో ఆమెను హత్య చేశాడు.కొల్లాపూర్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన స్వర్ణలత టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. స్వర్ణలత భర్తతో విడాకులు తీసుకొని గత ఏడేళ్లుగా ఒంటరిగానే ఉంటోంది. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన యువకుడు విజయ్ కుమార్(23)తో పరిచయం ఏర్పడింది. ఆమె అతని కంటే దాదాపు 15 ఏళు పెద్దది. అయినా హద్దులు దాటారు. శారీరకంగా దగ్గరయ్యారు.

తననే పెళ్లి చేసుకోవాలని స్వర్ణలత డిమాండ్

అయితే కొన్నాళ్ల క్రితం నుంచి విజయ్ ఇంకో అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడిపిస్తున్నాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని భావించాడు. కానీ ఇంతలోనే ఈ విషయం స్వర్ణలతకు తెలియడంతో సదరు యువతిని దూరం పెట్టి తనను పెళ్లి చేసుకోవాలని కోరింది. లేదంటే మనిద్దరం కలిసి ఉన్న ఫోటోలను మీ తల్లిదండ్రులకు చూపిస్తానని విజయ్ కుమార్‌ను బెదిరించింది. ఇలా రెండు, మూడు సార్లు బ్లాక్ మెయిల్‌కు పాల్పడడంతో స్వర్ణలత అడ్డు తొలగించుకోవాలని విజయ్ భావించాడు. ఈ క్రమంలోనే విజయ్ పనిచేస్తున్న ప్రైవేటు సంస్థ వద్దకు వెళ్లి మాట్లాడాలని కోరింది స్వర్ణలత. అయితే ఇక్కడ అందరూ ఉంటారని చెప్పి కృష్ణా నదీతీరంలోని మంచాలకట్టకు వెళ్దామని చెప్పి స్వర్ణలతను అక్కడికి రమ్మని చెప్పాడు విజయ్ కుమార్. స్వర్ణలత మంచాలకట్ట వద్దకు రాగానే అక్కడి నుంచి తన బైక్ పైన సాకలి రాముని గుట్టపైకి తీసుకెళ్లాడు. అనంతరం అక్కడ మాట, మాట పెరిగి వాగ్వివాదం జరిగింది.

గొంతు నులిమి హత్యఆపై దహనం:

ఎలాగో అడ్డుతొలగించుకోవాలనుకున్న విజయ్ కుమార్ ఇదే అదునైన సమయంగా భావించి స్వర్ణలత గొంతి పిసికి చంపేశాడు. ఇక హత్య ఆనవాళు లేకుండా చేయాలని భావించి స్వర్ణలత డెడ్ బాడీని దహనం చేయాలని ప్లాన్ చేసుకున్నాడు. నేరుగా మంచాలకట్ట గ్రామానికి వెళ్లి అక్కడ రెండు లీటర్ల పెట్రోల్, అగ్గిపెట్టె కొని.. మళ్లి ఘటన స్థలికి వెళ్లాడు. అక్కడ స్వర్ణలత డెడ్ బాడీపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.ఇక మేకల కాపర్లు ఈ నెల 13న డెడ్ బాడీని గమనించి మంచాలకట్ట గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. ఇక గ్రామకార్యదర్శి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అయితే శవం దహనం చేయడంతో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులకు కేసు సవాల్‌గా మారింది. సమీప ప్రాంతాల్లో ఎక్కడా మిస్సింగ్ కేసు నమోదు కాకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగలేదు. ఈ క్రమంలో కొల్లాపూర్ సీఐ కార్యాలయంలో తన కూతురు స్వర్ణలత కనపించడం లేదని తండ్రి బాలస్వామి ఫిర్యాదు చేశాడు. బాలస్వామికి డెడ్ బాడీ వద్ద లభించిన గాజులు, ఆభరణాలు చూపించడంతో తన కుమార్తెనని నిర్ధారించాడు. ఇక సాంకేతిక ఆధారాలు, స్థానికంగా విచారణ ప్రారంభించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెతో శారీరక సంబంధం నెరుపుతున్న విజయ్ కుమార్ ఈ దారుణానికి ఒడిగట్టాడని తెలింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు.ఒక మహిళతో శారీరక సంబంధం ఇంకో యువతితో ప్రేమ వ్యవహారం సీన్ కట్ చేస్తే మహిళ హత్య ప్రేమికుడు జైలుకి వెళ్ళాడు.

### మరో 2వేలు తగ్గిన పసిడి ధరలు

హైదరాబాద్,బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి.

# ఫోన్ పే.. జీ పే దెబ్బకు భీమ్ సైతం చేతులెత్తేసింది




న్యూఢిల్లీ,డబ్బులు ఇవ్వాలన్నా.. తీసుకోవాలన్నా.. నోట్లతో పని లేకుండా కంటికి కనిపించని రీతిలో బ్యాంకు ఖాతాల్లో జమ కావటం అది కూడా క్షణాల వ్యవధిలో అయ్యే టెక్ మాయాజాలాన్ని కొన్నేళ్లుగా భారత ప్రజలకు అలవాటైంది. వాళు వీళ్లు అన్న తేడా లేకుండా చివరకు భిక్షాటన చేసేటోళ్లు సైతం క్యూఆర్ కోడ్ పట్టుకొని.. తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయించుకుంటున్న పరిస్థితి.డిజిటల్ పేమెంట్లకు సంబంధించి ప్రభుత్వరంగ సంస్థకు చెందిన భీమ్ యాప్ ఉండనే ఉంది. అయితే.. దీని ప్రభావం చాలా తక్కువ. ప్రైవేటు సంస్థలకు చెందిన గూగుల్ పే (జీ పే).. ఫోన్ పే ముందు మిగిలినవన్నీ దిగదుడుపే. వీటి తరహాలో మార్కెట్ లో ముప్ఫై వరకు థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు ఉండగా.. మొత్తం లావాదేవీల్లో 80 శాతం జీపే.. ఫోన్ పే సంస్థల ద్వారానే జరగటం చూస్తే.. ఈ రెండు అప్లికేషన్ల గుత్తాధిపత్యం ఏమిటో ఇట్టే అర్థమవుతుంది.యూపీఐ లావాదేవాల్ని ఈ రెండు సంస్థలు నియంత్రిస్తున్న ఫిర్యాదులు అంతకంతకూ ఎక్కువ అవుతున్నాయి. ఈ తీరుపై చర్యలు తీసుకోవాలని తాజాగా ఆర్థిక శాఖను.. ఆర్ బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఇండియా ఫిన్ టెక్ ఫౌండేషన్ కోరింది. ఈ సంస్థ ఇలా ఎందుకు చెప్పింది? దీనికున్న ప్రాధాన్యత ఏమిటన్న విషయంలోకి వెళితే.. ఫిన్ టెక్ పరిశ్రమలకు స్వీయ నియంత్రణ మండలిగా ఈ సంస్థ వ్యవహరిస్తోంది.అంటే.. ఫిన్ టెక్ సంస్థల పని తీరు..వారి వ్యవహారశైలిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. ప్రభుత్వ సంస్థలకు సలహాలు.. సూచనలు చేస్తూ ఉంటుంది. జీపే.. ఫోన్ పే సంస్థలు భారీ తగ్గింపులు.. క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇస్తూ తమ అధిపత్యాన్ని కాపాడుకుంటున్నాయని.. తమ మాదిరే సేవలు అందించే చిన్న సంస్థలు.. దేశీ పోటీదారులు తమతో పోటీ పడలేని రీతిలో చేస్తున్నట్లుగా పేర్కొంది. అదెంతలా అంటే.. భారత ప్రభుత్వానికి చెందిన భీమ్ ఫ్లాట్ ఫామ్ సైతం ఈ దెబ్బకు మార్కెట్ వాటాను కోల్పోయిన పరిస్థితి.ఏదైనా సంస్థ గరిష్ఠంగా 30 శాతం లావాదేవీలకే సేవలు అందించాలన్న పరిమితిని ఉంది.అయితే.. ఆ రూల్ ను అమలు చేసే విషయంలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ) చేస్తున్న ఆలస్యం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఈ సంస్థ 2008 డిసెంబరులో స్థాపించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లకు సంబంధించి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయటమే దీని లక్ష్యం. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండయా, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ దీనిని ప్రమోట్ చేశాయి. ఈ సంస్థ యూపీఐ ఫిర్యాదులను పరిశీలించి..చర్యలు తీసుకుంటుంది.డిజిటల్ పేమెంట్లకు సంబంధించిన గుత్తాధిపత్యాన్ని నిరోధించాలన్న అంశంపై చేస్తున్న జాప్యాన్ని ఎఫ్ఎఫ్ సైతం ప్రశ్నిస్తోంది. సంస్థ ఏదైనా 30 శాతం లావాదేవీలకే సేవలు అందించాలన్న పరిమితిని అమలు చేయని కారణంగా ఈ సంస్థలు మరింత పెద్దవిగా అవతరించేందుకు అనుమతిస్తున్నాయన్నది ఇప్పుడు చర్చగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు రెండు బడా యూపీఐ సంస్థలతో పాటు మిగిలిన వాటికి యూపీఐ ప్రోత్సాహకాల్లో అధిక వాటా అందుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరి.. ఈ సూచనలపై ఎన్ పీసీఐ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# 10శాతం టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన

న్యూఢిల్లీ, అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. జిన్‌పింగ్ తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు



సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com